క్లుప్తంగా

సబితారెడ్డికి వినతి



సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

బడంగ్‌పేట్: ఎమ్మెల్యే సబితారెడ్డికి భూ బాధితులు వినతిపత్రం ఇచ్చారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని సర్వే నంబర్ 2లోని భూ బాధితులు గురువారం ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూమిని చిత్రం వంశానికి చెందిన బాధితులకు అందేలా న్యాయం చేయాలని విన్నవించారు. న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని సబితారెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గుడ్ల శ్రీనివాస్, రమేశ్, పోచమ్మ, ఎలమ్మ, దేవయ్య, ముత్యాలు, యాదయ్య, సుధాకర్, శ్రీనివాస్, మహేందర్ తదితరులున్నారు.

మంత్రులకు శుభాకాంక్షలు



ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న జంగారెడ్డి తదితరులు

కందుకూరు: పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి గురువారం అసెంబ్లీ వద్ద డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుడు మదన్‌పాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి ఉన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజలో పాల్గొన్న మహిళలు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ 5వ డివిజన్‌లోని ఇంద్రాహిల్స్ కాలనీలో గురువారం స్వామి వెంకటేశ్ ఆధ్వర్యంలో మహా పడిపూజ నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప.. శరణంశరణం అయ్యప్ప.. స్వామి శరణం అయ్యప్ప అంటూ అయ్యప్ప స్వామి నామస్మరణతో కాలనీ మార్మోగింది. పూజలో మహిళలతో పాటు కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, అయ్యప్ప స్వాములు, గురుస్వాములు, 5వ డివిజన్ కార్పొరేటర్ బోయపల్లి దీపిక పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



బాధితుడికి చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామానికి చెందిన క్యాతీక మధుకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.38 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితుడికి చెక్కును జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ సేవ్యానాయక్, ఉప సర్పంచ్ పాండు, నాయకులు మహేశ్, పాండు, కిషన్, శ్రీకాంత్, రాజు ఉన్నారు.

గ్యారంటీలను అమలు చేస్తాం

యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేశ్

తలకొండపల్లి: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాటిక నరేశ్ ముదిరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతీ నెల రూ. 2500, రూ. 500 కే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్‌ల్లో ఉచిత ప్రయాణం, రైతు భరోసా కింద పతి ఏటా రైతులు, కౌలు రైతులకు ఎకరానికి రూ. 15000, వ్యవసాయ కూలీలకు రూ. 12000, గృహజ్యోతి కింద ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ పథకం కింద ఇల్లు లేని వారికి ఇంటి స్థలంతో పాటు, రూ. లక్షలు, ఉద్యకారులకు 250 చ.గ. ఇంటి స్థలం, యువ వికాసం కింద విద్యార్థులకు రూ. 5 లక్షల విద్యా భరోసా కార్డు, ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్, చేయూత పథకం కింద రూ. 4000 ప్రతి నెల పింఛన్, రూ. 10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమాను అమలు చేస్తామని ఆయన వెల్లడించారు. ఇప్పటికే ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 10 లక్షల వైద్య సాయాన్ని అమలు చేశామన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఆమనగల్లు: పోలెపల్లి గ్రామానికి చెందిన గౌని ముత్యాలుగౌడ్ గురువారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను పోలెపల్లి ఎంపీటీసీ కుమార్ పరామర్శించి రూ.3 వేలు ఆర్థికసాయం అందజేశారు.

మట్టి స్నానం.. మహారోగ్యం!

- మానసిక ప్రశాంతత
- వివిధ రుగ్మతలు నయం
- రోగ నిరోధక శక్తి పెంపు
- ఆసక్తి చూపుతున్న నగరవాసులు



మట్టిస్నానం చేస్తున్న ధ్యానులు

హుడాకాంప్లెక్స్: పంచభూతాల్లో మట్టి ఒకటి. మట్టి లేకపోతే మనుగడే లేదు. పుట్టుక మొదలు, చనిపోయేవరకు మట్టితో విడదీయరాని సంబంధం ఉంది. వైద్య పరిభాషలో మడ్‌బాత్‌గా పిలుచుకొనే మట్టి స్నానానికి ఆధరణ పెరుగుతోంది. కష్టపడకుండానే ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకునే సదుపాయం ఉండటంతో నగరవాసులు మట్టి స్నానంపై ఆసక్తి చూపుతున్నారు. రక్తపోటును అదుపులో పెట్టడంతో పాటు రోగ నిరోధక శక్తిని పెంచుకుంటున్నారు. మానసిక ఒత్తిడి, కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందుతున్నారు. సరూర్‌నగర్ డివిజన్ హుడాకాంప్లెక్స్ వేదికగా ఈ మడ్‌బాత్ స్నానంపై శిక్షణ ఇస్తున్నారు యోగ గురువు ఇస్మాయిల్.

కాంతివంతంగా..

మట్టి స్నానం మహా ఆరోగ్యాన్ని కలిగిస్తుంది. మట్టిలో సప్త ధాతువులు ఉంటాయి. భూమిలో ఉండే ఖనిజాల గుణములన్నీ మట్టిలో మమేకమై ఉంటాయి. మట్టితో స్నానం చేసినప్పుడు శరీరానికి సహజంగా ఉండే గ్రహణశక్తి.. మట్టిలోని సప్త ధాతువులు శరీరంలోకి ప్రవేశించడం వలన కాంతివంతంగా, ఆరోగ్యవంతంగా మారుతుంది. స్నానానికి ఉపయోగించే బురద సాధారణంగా సహజమైన బంకమట్టి మరియు ఎర్రమట్టి, పుట్ట మట్టిని నీటితో కలిపి తగిన ఉష్ణోగ్రతలో వేడి చేస్తారు. ఆ తర్వాత బురదను శరీరానికి పూస్తారు. పూసిన తర్వాత 15 నుంచి 20 నిమిషాల పాటు బురదలో నానబెడతారు.

నిరోధకశక్తి పెంపు

మట్టి స్నానాల వలన చాలా ప్రయోజనాలు కలుగుతాయని పరిశోధకులు చెబుతున్నారు. మట్టిలో ఉండే వేడి రక్త ప్రసరణను పెంచడానికి మరియు రోగ నిరోధక వ్యవస్థను ఉత్తేజపరిచేందుకు సహాయపడుతుంది. అయితే బురదలోని ఖనిజాలు అనేక రకాల వైద్యం లక్షణాలను కలిగి ఉన్నాయని నమ్ముతారు. మట్టి స్నానంతో కండరాల నొప్పి, మానసిక ఒత్తిడిని తగ్గించడంతో పాటు ఆరోగ్యకరమైన చర్మాన్ని పొందవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

మహిళల కోసం ప్రత్యేకం

''అనారోగ్యంగా ఉంటే ఆయా ప్రదేశాల్లో మట్టిని ఎంత సమయం ఉంచాలి? ఏ విధంగా తగ్గుతుంది. అనే విధానంపై సూచనలిస్తున్నాం. మహిళల కోసం ప్రత్యేకంగా మహిళ యోగ ట్రైనర్‌తో శిక్షణ ఇస్తున్నాం. 15 రోజులు యోగ శిక్షణ పూర్తి చేసుకున్న శిష్యులందరినీ తీసుకెళ్లి.. మట్టి యోగము, జలయోగము, క్రియాయోగము, సూర్యయోగము అందజేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో పచ్చి కూరగాయలతో చేసిన వంటలకే అధిక ప్రాధాన్యత ఇస్తాం. ఈ ప్రక్రియ వలన అనేక రోగాలు నయం కావడాన్ని మేము గమనించాం'' అని ఇస్మాయిల్ గురూజీ తెలిపారు.

ఆరోగ్య సమాజమే లక్ష్యం



యోగా రత్న, యోగా సేవారత్న, స్వధర్మయోగి, నేషనల్ ఇంటర్నేషనల్ అవార్డులు పొందాను. 20 సంవత్సరాలుగా వివిధ రకాల యోగా శిక్షణ ఇస్తూ... యోగా సేవలో జీవితాన్ని గడుపుతున్నాను. యోగాలో శిక్షణ ఇస్తూ ఆరోగ్య సమాజాన్ని నిర్మించడమే లక్ష్యం.

–ఇస్మాయిల్ గురూజీ

ప్రజలకు అండగా ఉంటా

- ఆడబిడ్డలా ఆదుకుంటా
- ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: అభివృద్ధికి పట్టం కట్టి మూడోసారి భారీ మెజారిటీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే సబితారెడ్డి హామీ ఇచ్చారు. గురువారం సాయంత్రం జిల్లెలగూడ ఎస్‌వైఆర్ గార్డెన్స్‌లో జరిగిన కృతజ్ఞత సభకు సబితారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తన గెలుపు కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆడబిడ్డగా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశానని, భవిష్యత్ జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించాలని కోరారు. అనంతరం సబితారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మేయర్ దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, మీర్‌పేట బీఆర్ఎస్ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న సబితారెడ్డి

16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడలోని మత్స్యావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి జనవరి 14వ తేదీ వరకు మార్గశిరమాస ధనుర్మాస ఉత్సవాలు జరుపుతున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో ప్రతిరోజు ప్రత్యేక పూజలతో పాటు 23వ తేదీన వైకుంఠ ఏకాదశి, జనవరి 11న కూడార్ మహోత్సవం, 14వ తేదీన శ్రీ గోదా రంగనాథుల కల్యాణోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని, అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఈఓ తెలిపారు.

శరవేగంగా రోడ్డు నిర్మాణం

- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు, స్థానికులు



మన్సాన్‌పల్లి- ఘట్టుపల్లి బీటీ రోడ్డు

మహేశ్వరం: మన్సాన్‌పల్లి–కోళ్లపడకల్ రోడ్డు వయా ఘట్టుపల్లి బీటీ డబుల్ రోడ్డు నిర్మాణం పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రత్యేక చొరవతో రోడ్డు నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం నుంచి సుమారు రూ.15.20 కోట్ల నిధులు తీసుకొచ్చి శంకుస్థాపన చేశారు. మన్సాన్‌పల్లి, ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి, కోళ్లపడకల్ పీడబ్ల్యూ రోడ్డు వరకు రోడ్డు వెడల్పు కోసం స్థానిక ప్రజా ప్రతినిధులు రోడ్డు విస్తరణ కోసం భూములిచ్చేందుకు రైతులను ఒప్పించారు. రోడ్డు మధ్యలో వర్షం నీరు వెళ్లడానికి కల్వర్టులను కూడా నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణంతో పొరండ్ల, కోళ్లపడకల్, ఆకన్‌పల్లి, ఘట్టుపల్లి, ఘట్టుపల్లి తండా, మన్సాన్‌పల్లి గ్రామాల ప్రజల కష్టాలు తీరనున్నాయి. రోడ్డు నిర్మాణంతో ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి, కోళ్లపడకల్ గ్రామాల సర్పంచ్‌లు కొరుపోలు ప్రభాకర్‌రెడ్డి, యాదయ్య, నారాయణరెడ్డితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'ఫార్మా' తరలింపు ప్రకటనతో సంబురాలు



కందుకూరు: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మీర్‌ఖాన్‌పేటలో..

కందుకూరు: ఫార్మాసిటీని దూరంగా తరలించాలని హైదరాబాద్‌కు దగ్గరగా కాలుష్య పరిశ్రమలు ఉండవద్దని, ఫార్మాసిటీ ప్రాంతంలో మెగా టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఫార్మాసిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేయడంతో ఈ ప్రాంతం వల్లకాడయ్యేదన్నారు. ఆ విషయాన్ని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీని ఇక్కడి నుంచి తరలిచనున్నట్లు ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శమంత, పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు మల్లేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, డైరెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సరికొండ పాండు, సీనియర్ నాయకులు సత్యనారాయణ, రాకేశ్‌గౌడ్, హన్మంత్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు సులేమాన్, యూత్ అధ్యక్షుడు నరసింహాచారి, వెంకటేశ్‌గౌడ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ప్రచార కమిటీ సెల్ అధ్యక్షుడు జగన్, నరసింహ, ఆంజనేయులు, ఎ.కృష్ణ, ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్‌చారి, సోషల్ మీడియా అధ్యక్షుడు సిద్ధేశ్వర్‌గౌడ్, సయ్యద్ అజీజ్, వి.బాబు తదితరులు పాల్గొన్నారు.

మీర్‌ఖాన్‌పేటలో..

మీర్‌ఖాన్‌పేటలో మాజీ సర్పంచ్ నర్సింహ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మాను వ్యతిరేకించిన తమ లాంటి వారిపై గత ప్రభుత్వం కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాను ఇక్కడి నుంచి తరలించాలని నిర్ణయం తీసుకోవడం హర్షించ దగ్గ విషయమని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మదన్‌పాల్‌రెడ్డి, వెంకటేశ్, కె.నర్సింహ, ఎ.జగదీష్‌బాబు, బి.మధుసూదన్‌రెడ్డి, ఎ.నర్సింహ పాల్గొన్నారు.

శుభపరిణామం

ఫార్మాసిటీని తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాంచందర్ కొనియాడారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కందుకూరు, యాచారం మండలాల పరిధిలో ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా ఫార్మా కంపెనీలను ఈ ప్రాంతంలో పెట్టడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుందన్నారు. అరకొర నష్టపరిహారం చెల్లించి వేల ఎకరాల భూములను లాక్కొందని విమర్శించారు. 2013 చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని ప్రజల పక్షాన పోరాటం చేస్తే కేసులు పెట్టి జైళ్లల్లో పెట్టారని మండిపడ్డారు. సీపీఎం తరఫున సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ప్రకటించారు. భూములు కోల్పోయిన వారికి తిరిగి ఆ భూములను అప్పగించాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు కుమార్, బాల్‌రాజు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకం



జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులకు హెల్త్ కిట్స్ పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: జీహెచ్‌ఎంసీ అభివృద్ధిలో పారిశుధ్య కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమైనదని, వారు తమ ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్ వార్డు కార్యాలయంలో గురువారం ఆమె పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య సంరక్షణకు ఉపయోగపడే వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కార్మికులు నిర్విరామంగా కృషి చేస్తున్నారని, వారిసేవలను ప్రభుత్వం గుర్తించి అన్ని విధాల ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రనాయక్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పోగుల నర్సింహ, సతీష్‌గౌడ్, బానోతు శ్రీనివాస్ నాయక్, కప్పూర నాయక్, భవాని తదితరులు పాల్గొన్నారు.

స్కైవేల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



సాగర్ రింగ్ రోడు వద్ద నిర్మిస్తున్న స్కై ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

- ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: ఔటర్ రింగ్‌రోడ్డు తరహాలో సాగర్‌రింగ్ రోడ్డులో లూప్ ఆకారంలో నిర్మిస్తున్న స్కైవే ఫ్లైఓవర్లు పూర్తైతే ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారమవుతుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎస్ఆర్‌డీపీ పనుల్లో భాగంగా రూ.135 కోట్లతో చేపట్టిన ఈ పనులను అధికారులతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎల్బీనగర్‌లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఉద్దేశించిన స్కై ఫ్లైఓవర్లను వచ్చే సంక్రాంతి నాటికి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు ఇంజినీర్లు పనులను వేగవంతంగా చేయాలని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించిన 47 ప్రాజెక్టుల్లో 36 అందుబాటులోకి వచ్చాయని, వీటిలో సాగర్ రింగ్‌రోడ్డులో సెకండ్ లెవల్ ఫ్లైఓవర్‌తో పాటు రెండు లూప్స్ స్కై ఫ్లైఓవర్లు సైతం ప్రత్యేక నిర్మాణాలుగా చరిత్రలో నిలుస్తాయని ఎమ్మెల్యే అన్నారు. ఎల్బీనగర్, చంపాపేట, సాగర్‌రింగ్‌రోడ్డు మార్గాలవైపు వెళ్లేందుకు ఈ లూప్ లైన్లు ప్రజలకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎస్.ఈ రవీందర్‌రెడ్డి, ఈఈ రోహిణి, డీఈ కార్తీక్, ఏఈ పరమేశ్, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిన్నారుల వైద్యానికి సాయం



స్నేహితుడికి సాయం అందిస్తున్న బాల్యమిత్రులు

ఆమనగల్లు: కలిసి చదువుకున్న మిత్రుడి కుమార్తెల వైద్య ఖర్చుల నిమిత్తం తోటి మిత్రులు ఆర్థికసాయం అందజేశారు. ఆమనగల్లు పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాలలో 1998–99 ఎస్ఎస్‌సి బ్యాచ్ విద్యార్థి అయిన రవి ఇద్దరు కుమార్తెల్లో ఒకరికి చెవిటి మరొకరు మూగవారు కావడంతో వారి చికిత్స నిమిత్తం ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు గురువారం రవి కుటుంబ సభ్యులకు రూ.36,800 ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో సయ్యద్ షరీఫ్, కోటి, నగేశ్, సురేశ్, సత్యంసింగ్ తదితరులు ఉన్నారు

స్పీకర్‌కు శుభాకాంక్షలు



స్పీకర్‌గా ఎంపికైన ప్రసాద్‌కుమార్

తలకొండపల్లి: నూతన అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌కుమార్‌కు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు. ఏకగ్రీవంగా అసెంబ్లీ సభాపతిగా ఎన్నికైన ప్రసాద్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శాసనసభ వ్యవస్థలో ఉన్నతస్థానానికి ఎదిగిన ప్రసాద్‌కుమార్ ఆ స్థానానికి మరింత గౌరవం వచ్చేలా సభను నిర్వహిస్తారని ప్రభాకర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ నేతలను కలిసిన అనిల్



ఢిల్లీలో బీసీ నేతలతో అనిల్

తలకొండపల్లి: ఢిల్లీలో బీసీ నేతలను మండల కేంద్రానికి చెందిన బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్ గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జాతీయ స్థాయి నాయకులైన ఉద్యమ నేత తల్లోజు ఆచారి, ఫైర్‌బ్రాండ్ రఘునందన్‌రావు, బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, హైకోర్టు న్యాయవాది జగన్‌ను అనిల్ ఢిల్లీలో కలుసుకున్నారు. హలో బీసీ–చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ ఆధ్వర్యంలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని మహాసభ నిర్వహించారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

లారీ డ్రైవర్‌పై కానిస్టేబుల్ దాడి

నాగోలు: ప్రమాదవశాత్తూ కారును ఢీకొట్టిన లారీ డ్రైవర్‌పై హెడ్‌కానిస్టేబుల్ దాడి చేసి, బలవంతంగా నష్టపరిహారం వసూలు చేసిన ఘటన నాగోలు డివిజన్ బండ్లగూడ చౌరస్తాలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ తన కుటుంబంతో కలిసి కారులో తట్టిఅన్నారం నుంచి బండ్లగూడ వైపు వస్తున్నాడు. అదే దారిలో ఇసుక లోడ్‌తో ఓ లారీ వస్తోంది. బండ్లగూడ చౌరస్తా వద్ద వాటర్ లీకేజీ కావడంతో మరమ్మతుల కోసం బుధవారం రాత్రి జలమండలి అధికారులు రోడ్డును కొంత మేర మూసివేశారు. అక్కడకు లారీ, కారు ఒకేసారి వచ్చాయి. లారీ డ్రైవర్ కారును గమనించకుండా ముందుకు పోనివ్వడంతో కారుకు ఎడమవైపుకొంత గీసుకుపోయింది. వెంటనే కారులో ఉన్న హెడ్ కానిస్టేబుల్ బయటకు దిగి లారీ డ్రైవర్‌ను దుర్భాషలాడుతూ అతడిపై దాడి చేశాడు. దీంతో స్థానికంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికుడు ఒకరు ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తుండగా హెచ్ కానిస్టేబుల్ అతడినీ దుర్భాషలాడాడు. స్థానికులు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలానికి రావడంతో కారును లారీ ఢీకొట్టడంతో అలా అన్నానని చెప్పాడు. అనంతరం అక్కడకు వచ్చిన నాగోలు పోలీసుల సాయంతో లారీ డ్రైవర్ నుంచి బలవంతంగా డబ్బు తీసుకుని వెళ్లిపోయారు. ఫ్రెండ్లీ పోలీస్ అని చెప్పుకునే పోలీసులు డ్రైవర్‌పై దాడి చేయడం, స్థానికులను తిట్టడం ఏమిటని పలువురు స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

కొత్తపేటలో సందడి చేసిన మానస



నూతన వస్త్ర షోరూంను ప్రారంభిస్తున్న మానస

హుడాకాంప్లెక్స్: కొత్తపేటలోని శ్రీ లక్ష్మీ వైట్‌హౌస్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వాషినీ శిల్క్స్ షోరూం ప్రారంభోత్సవానికి ఫెమినా మిస్ ఇండియా–2020 మానస వారణాసి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మానస మాట్లాడుతూ మహిళలకు నచ్చే, మెచ్చే రీతిలో వివిధ రకాల మోడల్స్ అందుబాటులో ఉంచడం ఈ షాపు ప్రత్యేకత అని అన్నారు. డైరెక్టర్ నిరంజన్ మాట్లాడుతూ చిల్లపల్లి హ్యాండ్లూమ్స్ ద్వారా సేకరించిన నాణ్యమైన వస్త్రాలను అతి తక్కువ మార్జిన్స్‌తో వినియోగదారులకు అందజేయడం జరుగుతుందన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తానని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఎంపీపీ కార్యాలయంలో దివ్యాంగులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులను కుటుంబాల్లోని వ్యక్తులు చిన్నచూపు చూడవద్దని సూచించారు. వారి ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని తెలిపారు. సంక్షేమ పథకాలను వారికి సక్రమంగా అందేలా చేయాల్సిన బాధ్యత మనపై ఉందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరయ్యే నిధుల్లో వారికే అందజేసేలా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి ఉమారాణి పాల్గొన్నారు.